గొల్లపూడి కాలమ్

వీరప్పన్ బ్రతికుంటే

మొన్న చచ్చిపోయిన వీరప్పన్ చచ్చిపోకుండా బ్రతికుంటే బాగుండునని, బ్రతికుండగా పట్టు కోగలిగితే బాగుండేదని మన హోంమంత్రి శివరాజ్ పాటిల్ గారన్నారు.

120 మందిని చంపి, 30 సంవత్సరాలపాటు వందలాది ఏనుగుల దంతాలు పీకి, చందనాన్ని దోచిన వీరప్పన్ తాను బ్రతికుంటే ఏమయేదో తెలుసుకొనే వుంటాడు. తను బ్రతికుంటే ఎంతో మంది చావక తప్పదన్న సత్యాన్ని ఎరిగి, ప్రాణ త్యాగం చేసిన వీరుడు వీరప్పన్.

అతను బ్రతికుంటే చాలా మంది గొప్ప వారి గోత్రాలు ఈ పాటికి ఆంజనేయ దండకం లాగ చదువుతూండే వాడు. చాలా మంది నాయకులు 'అది నిజం కాద'ని నిజాల్ని ఆబద్ధాలుగా బుకాయించడానికి ప్రయత్నాలు చేసేవారు. నక్కీరన్ గోపాల్ మరికొన్ని కితాబుల్ని బయటికి తీసేవాడు. రాజ్ కుమార్ విడుదలకి ఎన్ని కోట్లు ఎవరి ద్వారా ఎవరికి ముట్టాయో కథలుకథలుగా మనకి తెలిసేవి. చెన్నై నుంచి బయలుదేరిన కోట్లు వీరప్పన్ దగ్గరికి వచ్చేసరికి లక్షలుగా మారి, ఎవరి జేబుల్లోకి ఎంతెంత చేరాయో వీరప్పన్ చెప్పగలిగే వాడు. అయ్యా, ఇదంతా అందమయిన సినీమా కథలాగ, చానల్స్ లో కనిపించే సీరియల్స్ లాగా సర్వాంగ సుందరంగా మన కళ్ళ ముందు సాక్షాత్కరించేది.

వినిపించని రాగాలు మధురమయినవి– అన్నాడు కీట్స్. మొన్నటికి మొన్న విజయలక్ష్మి అనే ప్రౌఢ తమిళనాడులో పోలీసుల గోత్రాలు చదువుతూంటే ప్రభుత్వాలు మింగలేక,కక్కలేక సతమతమవడం మనం చూస్తున్నాంకదా?

పోను పోను వీరప్పన్ రాజకీయ నాయకుడయేవాడు. అడవుల్లో కప్పెట్టిన కోట్ల ఆస్తితో అలవోకగా'వోట్లు' కొనేవాడు. ఏ అటవీ శాఖ మంత్రి అయినా ఆశ్చర్యం వుండేదికాదు. ఆతని మీదసినీమా తీసే హక్కు మాకుందంటె మాకుందని తమిళ,కర్ణాటక నిర్మాతలు కోర్టులకెక్కేవారు.మధ్యేమార్గంగా మన తెలుగు నిర్మాతలకి ఆ అవకాశం దక్కినా ఆశ్చర్యం వుండేదికాదు. ముత్తులక్ష్మి పాత్రని ఐశ్వర్యారాయ్ పోషించేది. నక్కీరన్ గోపాల్ పాత్ర కోసం– నేను ఖండితంగా పోటీ పడే వాడిని. ఆ మీసాలన్నా, నక్కీరన్ అన్నా నాకు మక్కువ ఎక్కువ. ఆయన వీరప్పన్‌కే రాయభారం ఎందుకు నడుపుతాడు? ఏ మేధాపాట్కర్‌కో ఎందుకు నడపడు. ఇందులో డబ్బుంది. మీసాలున్నాయి. నాకు నచ్చే కొన్ని హంగులున్నాయి. మరి తెలుగు వీరప్పన్ ఎవరు? ఈ ప్రశ్నకి సమాధానాన్ని మనం వీరప్పన్ చావు వల్ల మనం నష్టపోయాం.

అలనాడు కెనెడీ ని చంపిన లీ హార్వీ ఆస్వాల్డ్ బ్రతికుంటే– ఎంత మంది ఆత్మహత్యలు చేసు

కోవలసివచ్చేదో మనం ఊహించగలమా! ఇందిరా గాంధీ పేరు చెప్పి బ్యాంకు నుంచి కోట్లు డ్రా చేసిన నాగర్వాలా బ్రతికుంటే ఏమయేది? హత్య జరిగిన వెంటనే చంపబడ్డ బియంత్ సింగ్ బ్రతికుంటే ఎంతమంది కథల్ని బయటపెట్టేవాడు? కొన్ని చావులు కొన్ని'చిదంబర రహస్యాల'కి శాశ్వతంగా మూతలువేస్తాయి.

చరిత్రలో కొన్ని గొప్ప కథలు- ఇలాంటి  మహానుభావుల చావులవల్ల సమాజం నష్టపోయింది.

శివరాసన్ బ్రతికుంటే ప్రభాకరన్ కథని ఇంకా ఎంత సుస్పష్టంగా చెప్పగలిగేవాడు! నళిని రొమాన్స్ మరింత వివరంగా మనకి తెలిసేదికదా!

ఇప్పటికీ- వీరప్పన్ చరిత్ర మూలపడదని నా అభిప్రాయం. నేను ఎన్నికలలో నిలబడతానని భార్య ముత్తులక్ష్మి  మొన్ననే ప్రకటించింది. ఆవిడకి తన భర్త దాచిన కొన్ని లంకెల బిందెల ఆడ్రసులిసే వుంటుంది. ఆమె కన్నీటికీ, ఆమె భర్త చావుకీ దుఃఖించే  ఆర్ద్ర హృదయం మన భారతీయులకి బోలెడుంది. వీరప్పన్ పిల్లలుకూడా రేపు కొత్త కొత్త పరిశ్రమలను స్థాపించేఅవకాశంవుంది.

ఎక్కడో -నూటికో కోటికో - శివరాజ్ పాటిల్ వంటి వారు- కేవలం ప్రజలకి తృప్తిని కలిగించడానికి- వీరప్పన్ బ్రతికుంటే బాగుండేదని- అంటారు కాని- బ్రతికుండకపోవడం ఎంత అవసరమో- బ్రతకకుండా చూడడానికి- ఎంత మంది తాఖీదులు ఇచ్చారో- వారికీ తెలిసే వుంటుంది. కాని మనకి ఎప్పటికీ తెలీదు.

కోర్టు స్టాంపు కేసులో తెల్గీ గారు గొంతు విప్పారా? ఆయన గొంతు విప్పక పోవడానికి ఎన్ని కోట్లు ఖర్చవుతున్నాయో ఎవరికయినా తెలుసా?

వీరప్పన్‌లాంటి అమాయకపు దొంగలు బ్రతికుండి కొందరు అటవీ ప్రజలకి ఉపయోగ పడతారు. చచ్చిపోయి కొందరు గొప్ప నాయకులకి ఉపయోగ పడతారు. నామట్టుకు- వీరప్పన్ బ్రతికుంటే తప్పనిసరిగా మంత్రి అయే వాడు. చచ్చిపోయి శిలావిగ్రహం కాబోతున్నాడు. తమకి అనుమానంగా వుంటే కేవలం 6 నెలలు టైమివ్వండి. శూల మంగలం అడవుల ముఖద్వారం దగ్గర వీరప్పన్ శిలావిగ్రహం పెట్టకపోతే నన్ను అడగండి. దౌర్భాగ్యపు చేతల్ని 'రొమాంటిక్' దృష్టితో ఆదరించే దౌర్భాగ్యం పేరే ఈ దేశంలో 'డెమోక్రసీ'!

(రచయితని www.gollapudimaruthirao.com లో కలుసుకొన వచ్చును)